# నమస్తే తెలంగాణ

జోగుళాంబ గద్వాల వనపర్తి

5 మహబూబ్‌నగర్, గురువారం 29 ఆగస్టు 2024 JOGULAMBA GADWAL WANAPARTHY




చిన్నోనిపల్లిని తాకిన వరదనీరు

**చిన్నోనిపల్లికి జలగండం పొంచి ఉన్నది. ఊరును వరద చుట్టుముట్టడంతో** స్థానికుల్లో టెన్షన్.. టెన్షన్ నెలకొన్నది. వర్షాలు కురుస్తుండడంతో సమీపంలో ఉన్న రిజర్వాయర్‌లో నీటిమట్టం క్రమేపీ పెరుగుతున్నది. ఇప్పటికే ఊరి దరిదాపుల్లోకి జలాలు చేరాయి. దీంతో విషపురుగుల తాకిడి పెరిగింది. మళ్లా భారీ వానలు పడితే ఈసారి ముంపునకు గురికావాల్సిందే.. గ్రామాన్ని ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి వెళ్లాలని అధికారులు సూచిస్తున్నా.. అక్కడ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన ఈ ప్రాజెక్టుతో సాగునీటికి ఎలాంటి ఉపయోగం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఏ సమయంలో ఎలాంటి ఉపద్రవం వస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దినదినగండంగా జీవనం సాగిస్తున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకుంటున్నారు.

– గట్టు, ఆగస్టు 28

చిన్నోనిపల్లి వాసుల్లో టెన్షన్.. టెన్షన్..

# దినదినగండంగా..!

- ఊరి దరిదాపుల్లోకి రిజర్వాయర్ నీరు
- పునరావాస కేంద్రంలో సౌకర్యాలు కరవు
- ఇక్కట్లు పడుతున్న గ్రామస్తులు
- ప్రభుత్వం పట్టించుకోవాలని గ్రామస్తుల మొర

చిన్నోనిపల్లి పరిసరాలకు నీరు చేరింది. తాజా పరిస్థితిని చూస్తే గ్రామానికి జలగండం తప్పదనే పరిస్థితి కనబడుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చిన్నోనిపల్లి రిజర్వాయర్ సమీపంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో ఆ నీరంతా రిజర్వాయర్‌లోకి చేరింది. దీంతో నీటిమట్టం పెరిగి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపం వరకు నీళ్లు చేరాయి. ఒకటి, రెండు భారీ వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో గ్రామస్తులు ఉన్నారు. అయితే కనీక సౌకర్యాలు లేకుండా నిర్మించిన పునరావాస కేంద్రంలోకి ఎలా వెళ్లాలని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు.

**ఉమ్మడి రాష్ట్రంలో రూపకల్పన..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెట్టెంపాడు ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా చిన్నోనిపల్లి రిజర్వాయర్‌కు రూపకల్పన చేశారు. ఆంధ్రాకు నీటిని తరలించడానికే ఈ రిజర్వాయర్‌ను ఏర్పాటు చేశారనే విమర్శలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి. ఏమాత్రం ఆయకట్టు లేని రిజర్వాయర్‌ను ఎందుకు నిర్మించారని నిర్వాసిత రైతులు, ప్రజాసంఘాల నాయకులు గతంలో ఆందోళనలు కూడా చేపట్టారు. తమ ప్రయోజనాల కోసమే ఉమ్మడి ప్రభుత్వం ఈ రిజర్వాయర్‌ను చేపట్టిందనే విమర్శలు ఉన్నాయి.

**నీళ్లు బయటకు వెళ్లక ఇక్కట్లు..**

గతంలో వాగులు ప్రవహించే దగ్గర ఉన్న గండి ద్వారా రిజర్వాయర్ నుంచి నీరు బయటకు వెళ్లేది. అయితే ఆ ప్రాంతంలో గ్యాప్ లేకుండా కట్టను నిర్మించడంతో వరదనీరు రిజర్వాయర్‌లోనే నిలిచిపోతుంది. దీంతో నీటిమట్టం పెరిగి గ్రామం అంచు వరకు నీళ్లు వచ్చే పరిస్థితి ఏర్పడింది. కాగా గ్రామస్తులు, నిర్వాసిత రైతుల ఆందోళనలతో అధికారులు దిగొచ్చి రిజర్వాయర్ నుంచి నీరు బయటకు వెళ్లే విధంగా కాల్వ ఏర్పాటు చేశారు. నిన్నటి నుంచి కొద్దిపాటి నీరు మాత్రమే అందులోని రిజర్వాయర్ బయటకు పారుతున్నది. ఈ క్రమంలో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటన్నది స్థానికుల అంతుచిక్కడంలేదు.

**పునరావాసంలో సౌకర్యాల లేమి..?**

ముంపు గ్రామం సమీపంలోని ఎర్రగట్టు ప్రాంతంలో పునరావాస కేంద్రం ఏర్పాటు కోసం స్థలాన్ని సేకరించారు. 300 మందిదాకా నిర్వాసిత రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఇంకా కొందరికి పట్టాలు అందాల్సి ఉన్నది. రోడ్లు, డ్రైనేజీ, అరకొర తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం అయితే అవసరమైన సౌకర్యాలు కేంద్రంలో ఏర్పాటు కాలేదు. ఈ క్రమంలో తాము అక్కడికి వెళ్లి ఎలా ఉండాలని నిర్వాసిత రైతులు ప్రశ్నిస్తున్నారు.

**రైతులు కోరుతున్నది ఇదీ..**

ఎలాంటి ప్రయోజనాలు లేని చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను రద్దుచేసి భూసేకరణ చేసిన పొలాలపై తమకు హక్కులు కల్పించాలని ఆయా గ్రామాల నిర్వాసిత రైతులు మొరపెట్టుకుంటున్నారు. ఆంధ్రా ప్రాంతానికి నీటిని తరలించడానికి ఉమ్మడి రాష్ట్ర పాలకులు రూపొందించిన రిజర్వాయర్‌తో దమ్మిడి ఉపయోగం లేదంటున్నారు. ఈ నిర్మాణం కోసం తాము ఏండ్లుగా పోరాటం చేస్తున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. అదేవిధంగా ఏండ్ల కిందట ఇచ్చిన నష్టపరిహారం కాకుండా తాజాగా ఇప్పటి రిజర్వాయర్ల నిర్మాణాలకు ఇస్తున్న ప్యాకేజీని తమకు అమలు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోరుతున్నారు. పెండింగ్ బిల్లులు సైతం ఇంకా రావాల్సి ఉందని నిర్వాసితులు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి అందరికీ ఆమోదయోగ్యమైన ప్యాకేజీని అందిస్తే తామంతా గ్రామం విడిచిపెట్టి వెళ్తామని నిర్వాసితులు ఖరాఖండిగా చెబుతున్నారు.





చిన్నోనిపల్లి ముంపు గ్రామం, ఊరి చివర ఉన్న విద్యుత్ సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరిన వరద

**ఇబ్బందులు పడుతున్నాం..**



ముంపు గ్రామం చిన్నోనిపల్లిలో దినదినగండంలా బతుకుతున్నాం.. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఊరిచివరి వరకు రిజర్వాయర్ నీళ్లు చేరాయి. విష పురుగుల భయం ఎక్కువైంది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని మాకు న్యాయం చేయాలి. పునరావస కేంద్రంలో వసతులు కరువయ్యాయి. ప్యాకేజీ సాయం పెంచి అందించాలి.

– బోయ ఈరన్న, నిర్వాసిత రైతు, చిన్నోనిపల్లి

**గ్రామం విడిచి ఎక్కడికెళ్లాలి..**



ముంపు గ్రామాన్ని విడిచి పునరావాస కేంద్రంలోకి వెళ్దామంటే కనీస సౌకర్యాలు లేవు. అందులో నివాసం ఉండలేని పరిస్థితి. చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లోకి వరద వస్తుండడంతో నీటిమట్టం క్రమేపీ పెరుగుతున్నది. ఏం చేయాలో పాలుపోవడంలేదు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి.

– కుర్వ వీరేశ్, నిర్వాసిత రైతు, చిన్నోనిపల్లి



మాట్లాడుతున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, చిత్రంలో బీఆర్‌ఎస్ నాయకులు

## కాంగ్రెస్, బీజేపీ వ్యాఖ్యలు అర్థరహితం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 28 : ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంపై కాంగ్రెస్, బీజేపీ నేతలు పోటీలు పడి ఆరోపణలు చేయడం అసత్యం, అర్థరహితమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారమే బెయిల్ మంజూరు అయ్యిందని, కోర్టు తీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సింది పోయి విమర్శలు చేయడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఉన్నత విద్య, రాజకీయంగా సేవలను అందిస్తున్న మహిళను కావాలనే కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక రాజకీయ కుట్రలో జైలుకు పంపించారని మండిపడ్డారు. ఇదే విషయమై ఈడీ, సీబీఐని సుప్రీంకోర్టు సైతం మందలించిందని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ల తీరు ను ప్రజలు చీదరించుకుంటున్నారని ధ్వజమెత్తారు. అ నంతరం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం హనుమాన్‌పల్లికి చెందిన కుర్మ అంజయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కల్వకుర్తి మండలం జిల్లెల, మార్చాలలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, కృష్ణారెడ్డితోపాటు నాయకులు ఉన్నారు.

## అర్హులకే సంక్షేమ పథకాలను అందించాలి

- మైనార్టీ జాతీయ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది




అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యులు సయ్యద్ షెహజాది,పాల్గొన్న కలెక్టర్,ఎస్పీ

వనపర్తి, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకే అందించేలా చర్యలు చేపట్టాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది సూచించారు. బుధవారం కమిషన్ సభ్యురాలు వనపర్తి జిల్లా పర్యటన సందర్భంగా ఐడీవోసీ సమావేశపు హాలులో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి 15ప్రోగ్రాంల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మైనార్టీలకు సంబంధించిన పాఠశాలలు, అందులో ప్రభుత్వ స్థలంలో ఉన్నవి ఎన్ని అనే వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు ఆయన 15 ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలు, మూడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 652 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నట్లు చెప్పా రు. రూ. లక్ష సబ్సిడీ రుణాలు 100 మందికి ఇవ్వడం జరిగిందని, 280 కుట్టుమిషన్లు, 9,809 మంది మైనార్టీ విద్యార్థులకు 652 లక్షల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ ఇచ్చినట్లు ఆర్డీవో పద్మావతి వివరించారు. ఘణపురం మండలంలో 21ఎకరాల వక్ఫ్ భూములు ఆక్రమణకు గురైనట్లు చెప్పగా ,వెంటనే చర్యలు తీసుకోవాలని తాసీల్దార్‌ను కమిషన్ సభ్యురాలు ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ నగేశ్ పాల్గొన్నారు.

**గురుకుల పాఠశాల సందర్శన..**

పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలను జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించి విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, మరో భవనంలోకి మార్చాలని ఆర్‌ఎల్‌సీ కిరణ్మయిని ఆదేశించారు.

## జాతీయస్థాయి పోటీలకు..



విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల బృందం

కొల్లాపూర్, ఆగస్టు 28 : కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులు జాతీయ, రాష్ట్ర క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న రాజేశ్వరి ఈనెల 25వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన మారథాన్ రాష్ట్రస్థాయి 10కిలోమీటర్ల పరుగు పందెంలో రన్నర్‌గా నిలిచి జాతీయస్థాయి 40 కిలోమీటర్ల రిలే పరుగుపందెం పోటీలకు ఎంపికైంది. అలాగే మొదటి సంవత్సరం బీఏ చదువుతున్న అరవింద్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ కల్వకుర్తి సీబీఎం కళాశాలలో జరిగిన 1కేఎం పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ రమేశ్‌కుమార్, కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు.

## ప్రేమ విఫలమైందని యువకుడి మృతి



వడ్డేపల్లి : పోలీస్ స్టేషన్ సమీపంలో ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

- అమ్మాయి తండ్రి, మరికొందరి పేరిట సూసైడ్ నోట్
- న్యాయం చేయాలని బాధిత కుటుంబీకుల ఆందోళన

వడ్డేపల్లి, ఆగస్టు 28 : తాను ప్రేమించిన అమ్మాయిని దక్కనివ్వకుండా ఆమె తండ్రి బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఓ యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జూలేకల్ స్టేజీలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జూలేకల్ స్టేజీకి చెందిన చంద్రకళ, దేవేంద్రల కుమారుడు అశోక్(22) ఓ అమ్మాయిని ఆరేండ్లుగా ఇష్టపడుతున్నాడు. కాగా, అమ్మాయి తండ్రికి విషయం తెలిసింది. అతను పోలీసు కావడంతో కొందరు మిత్రులతో కలిసి అశోక్‌ను బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. తాను ప్రేమించిన అమ్మాయి దక్కదని కర్నూల్‌లోని లాడ్జిలో మంగళవారం రాత్రి అశోక్ సూసైడ్ నోట్ రాసి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కర్నూల్, శాంతినగర్ స్టేషన్లలో బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని బుధవారం స్టేషన్ సమీపంలోని రోడ్డులో మృతదేహాన్ని ఉంచి నిరసన తెలిపారు. ఇందుకు సీఐ రవి, ఎస్సై సంతోష్ స్పందించి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పగా, ఆందోళన విరమించారు. అక్కడి నుంచి జులేకల్ స్టేజీకి వెళ్లి అక్కడ రోడ్డుపై గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు నిరసన తెలిపారు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. గతంలో అశోక్ తండ్రి దేవేంద్ర కూడా పోలీసుల వేధింపుల వల్లే చనిపోయాడని, కొడుకును కూడా పోలీసులే పొట్టన పెట్టుకున్నారని మృతుడి తల్లి చంద్రకళ కన్నీటి పర్యంతమైంది. రోడ్డుపై నిరసన తెలుపుతున్న విషయం తెలుసుకున్న ఎస్సైలు సంతోష్, వెంకటేశ్, చంద్రకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబీకులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## రూ.1.96 లక్షలు లూటీ

ఉండవెల్లి, ఆగస్టు 28 : వర్క్ ఫ్రం హోం పేరుతో వల వేసిన సైబర్ నేరగాళ్లు రూ.1,96,844 లూటీ చేసిన ఘటన చోటు చేసుకున్నది. ఏఎస్సై సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన హనుమంతు టెలిగ్రాం యాప్‌ను వినియోగించేవాడు. జూలై 30న ఆ యాప్‌లో వర్క్ ఫ్రమ్ హోం పేరుతో ఉన్న లింక్‌ను ఓపెన్ చేసి ఐడీ, బ్యాంక్, ఆధార్ వివరాలు నమోదు చేశాడు. అనంతరం పెట్టిన పెట్టుబడికి అదనంగా ఆదాయం వస్తుందని నమ్మించి డబ్బులను జమ చేయాలని సైబర్ నేరగాళ్లు హనుమంతుకు సూచించారు. అది నమ్మిన హనుమంతు జూలై 30 నుంచి ఆగస్టు 21 వరకు రూ.1,96,844 జమ చేసినా ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

## ఉత్సాహంగా ఉట్ల ఉత్సవం



మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్లు కొడుతున్న యువకులు

పాలమూరు, ఆగస్టు 28 : జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనీలో గల కృష్ణదేవాలయం, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో పల్లకీసేవ వైభవంగా చేపట్టారు. అనంతరం ఉట్ల ఉత్సవాలను పద్మావతికాలనీలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ ప్రారంభించారు. అదే విధంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి పల్లకీసేవ అనంతరం ఉట్లకు పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రాంభించారు. ఉత్సవాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్లు కొట్టారు. కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

- బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఇద్దరు యువకులు మృతి
- ఆగ్రహంతోబస్సు అద్దాలను ధ్వంసం చేసిన గ్రామస్తులు




ప్రమాదానికి కారమణమైన ప్రైవేట్ ఆర్టీసీ బస్సు





మృతిచెందిన బోయ అశోక్, బోయచందు (ఫైల్)

పెద్దమందడి, ఆగస్టు 28 : ఆర్టీసీ బస్సును నిర్లక్ష్యం గా నడిపి రెండు ప్రాణాలను బలిగొన్న ఘటన వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో చోటుచేసుకున్నది. పామిరెడ్డిపల్లికి చెందిన బో య అశోక్ (23), బోయ చందు(23) ముందరితండా నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా, వనపర్తి నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు పామిరెడ్డిపల్లి సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్, చందు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కోపోద్రిక్తులై బస్సు అద్దాలను ధ్వంసం చేసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ఆర్డీవో పద్మావతి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వం తరుపున న్యాయం చేసేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా బస్సు యజమాని, ఆర్టీసీ వారితో మాట్లాడి పరిహారం ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. అయినప్పటికీ గ్రామస్తులు వినకుండా బీష్మించుకు కూర్చున్నారు. చివరకు ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే ఫోన్‌లో గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన మృతదేహాలను చూసి బాధితుల రోధనలు మిన్నంటాయి. కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## కృష్ణమ్మ పరుగులు

బీచుపల్లి క్షేత్రంలోని పుష్కరఘాట్‌ను ముంచెత్తుతూ వరద పారుతున్నది. ప్రస్తుతం నదిలో 2లక్షల 54వేల క్యూసెక్కులకు పైబడి వరద నీరు ప్రవహిస్తోందని, రాబోవు రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. – ఇటిక్యాల, ఆగస్టు 28



అనకాయపల్లి రోడ్డు పక్కల హరితహారం చెట్లను తొలగించిన దృశ్యం

## ప్రకృతితో పరిహాసం

పెద్దమందడి, ఆగస్టు 28 : జీవకోటి మనుగడకు చెట్లే మూలాధారమని అందరూ చెప్పే మాట. కేసీఆర్ సర్కారు హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా హరితహారం కార్యక్రమం ద్వారా విరివిగా మొక్కలను నాటించి పచ్చదనం పెంపు కోసం ఎంతో కృషి చేశారు. రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాలలో మొక్కలు నాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొక్కల పెంపకంపై దృష్టి సారించకపోవడంతో హరితహారం కార్యక్రమం నిర్లక్ష్యానికి గురైంది. కొందరు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని అనకాయపల్లి తండా పంచాయతీ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను జేసీబీతో తొలగించారు. ఈ విషయమై ఎంపీడీవో సద్గుణను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా, సమాచారం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించినట్లు తెలిపారు.

## ఉల్లి @ రూ.4,300



దేవరకద్ర, ఆగస్టు 28 : దిగుబడి తగ్గిపోవడంతో ఉల్లి ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం గరిష్ఠంగా రూ.4,300 పలుకగా, కనిష్టంగా రూ.3,600లుగా ధరలు పలికాయి. గత వారం గరిష్ఠంగా రూ.4,030 ధర ఉండగా, ఈ వారం రూ.390 పెరిగింది. మార్కెట్‌కు మొత్తం 30క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి రాగా, మార్కెట్ నిబంధనల ప్రకారం 45కిలోల తూకం వేసి విక్రయించారు. వచ్చేవారం ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు.

## అబద్ధానికి మారు పేరు 'కాంగ్రెస్'

- కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం
- హెల్ప్ డెస్క్ బహిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి, ఆగస్టు 28 : అబద్ధానికి మారు పేరుగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం డిమాండ్ చేశారు. కల్వకుర్తి మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించిన హెల్ప్‌డెస్క్‌ను మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పీఏసీసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ షాహెద్‌తో కలిసి చైర్మన్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ప్రవేశపెట్టినప్పుడు అక్ర మం, అమానుషం, పేదల రక్తాన్ని తాగుతారా అంటూ ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి గొప్పలు మాట్లాడారన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు డబ్బులు చెల్లించవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచితంగా స్థలాలు, లేఅవుట్లు క్రమబద్ధీకరిస్తామని ప్రచారం చేసిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌తో వేల కోట్లు ఖజానాకు మళ్లించేందుకు సిద్ధమైందని మండిపడ్డారు. ఎల్‌ఆర్‌ఎస్‌తో ఖజానాను నింపుకొనేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నాయని పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సైదులుగౌడ్, బావండ్ల వెంకటేశ్, భోజిరెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులుతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.